పేజీ కథ

# అలనాటి కథ

నెల్లూరి శ్రీరామ్ కుమార్

అవి నేను స్కూల్లో చదువుకునే రోజులు. మాక్లాస్‌లో నేనూ, సుబ్రహ్మణ్యం చాలా స్నేహంగా ఉండేవాళ్ళం. నన్ను వాడు 'రామూ' అని పిలిచేవాడు. నేను వాణ్ణి వాళ్ళ ఇంటిపేరుతో 'శొంఠీ' అని పిలిచే వాణ్ణి.

మా స్కూలు ముందే శొంఠిగాడుండే ఇల్లు. వాళ్ళింటి పెరటి తలుపులు, మా స్కూలు గేటు ఒకదానికొకటి ఎదురెదురుగా ఉండేవి.

రోజూ స్కూలు వదలగానే మేమిద్దరం వాళ్ళింటి పెరట్లో కాస్సేపు ఆడుకునేవాళ్ళం.

ఒకరోజు శొంఠిగాడు స్కూలుకి ఎగనామం పెట్టాడు. ఆ రోజంతా నాకేమీ తోచలేదు. స్కూలు ఎప్పుడు విడిచిపెడతారా అని ఎదురు చూస్తూ ముళ్ళమీద కూర్చున్నట్టు కూర్చున్నాను క్లాసులో.

మా పంతులుగారికి కడుపునొప్పన్నా వస్తే బావుణ్ణు, ఇంటికి పొమ్మంటారు అనుకున్నాను. కాని ఏం లాభం లేకపోయింది. సాయంత్రం నాలుగైనా ఆయనకి ఎలాంటి నొప్పీ రాలేదు.

నాలుగవ్వగానే ఇంటిబెల్లు కొట్టారు. అది వినీవినగానే నేను లేచి పుస్తకాల సంచీ భుజాన తగిలించుకుని స్కూలు బయటికి పరుగెత్తాను.

శొంఠిగాడి ఇంటిపెరటి తలుపులు మూసేసున్నాయి, గట్టిగా బాదాను.

"వస్తున్నా... వస్తున్నా" అని శొంఠిగాడి కంఠం... పరుగెత్తుకుంటూ వస్తున్నట్టు అడుగుల చప్పుడూ వినిపించింది.

ఆడుగుల చప్పుడు ఆగిపోయింది. తలుపు మాత్రం తెరుచుకోలేదు.

"ఎవరదీ?"

ఆ ప్రశ్నకి నాకు ఒళ్ళు మండింది.

"నీ మొగుణ్ణి! తొందరగా తలుపు తియ్యి." అన్నాను విసుగ్గా.

"ఛీ...ఫో..." అదీ సమాధానం . తలుపు మాత్రం తెరుచుకోలేదు.

"మొగుణ్ణి పొమ్మంటావేంటీ, తలుపు తెరువు." అరిచాను గట్టిగా.

తలుపులు మెల్లగా తెరుచుకున్నాయి. అంతే, నా గుండె ఆగినంతపనయ్యింది. ఎదురుగా శొంఠిగాడి చెల్లెలు నించుంది.

అలాంటి పరిస్థితి వస్తుందని నేను కలలో కూడా ఎప్పుడూ అనుకోలేదు. శొంఠిగాడి గొంతూ, వాళ్ళ అక్కగొంతూ, చెల్లెలిగొంతూ అచ్చుఒక్కలాగే ఉంటాయన్న సంగతి అప్పటివరకూ తట్టలేదు నాకు.

ఏం మాట్లాడాలో తోచక అలాగే నించుండిపోయాను. ఆ అమ్మాయి కూడా సిగ్గుతో అలాగే నిలబడిపోయింది.

కాస్సేపటికి ధైర్యం చేసి "మీ అన్నయ్య



ఉన్నాడా?" అని అడిగాను.

"ఉఁహుఁ.లేడు. ఎక్కడికో వెళ్ళాడు." తల దించుకుని చెప్పింది.

"నేనొచ్చి వెళ్ళానని చెప్పు"

"అలాగే. పోనీ కాస్సేపు ఇంట్లోకొచ్చి కూర్చోకూడదూ...?"

"అబ్బే ఫరవాలేదు. ఇంటి దగ్గర కాస్త పనుంది. నేను వెంటనే వెళ్ళిపోవాలి." అంటూ ఇంటిదారి పట్టాను.

కాస్త దూరంవెళ్ళి వెనక్కి తిరిగిచూశాను. శొంఠిగాడి చెల్లెలు ఇంకా గుమ్మంలోనే నించుని నావైపే చూస్తుంది. ఆ అమ్మాయి అలా నుంచుని చూస్తుంటే నాకెలాగెలాగో అయిపోయింది. ఏదో భయం, ఏదో తెలీని ఆనందం నన్నుక్కిరిబిక్కిరి చేశాయి.

అ తర్వాత నాలుగురోజుల దాకా శొంఠిగాడి ఇంటికి వెళ్ళాలంటే భయంభయంగా ఫీలయ్యాను. వాడు ఎప్పటిలాగే లాక్కువెళ్ళేవాడు. వాళ్ళింటికి వెళ్ళగానే నాకళ్ళు వాడి చెల్లెలికోసం వెతికేవి.

ఆ అమ్మాయి మెరుపులా ఒక్కక్షణం కనిపించి, ఒక చిరునవ్వు విసిరేసి మాయమైపోయేది. నేను ఏదో తెలీని మధురానుభూతిలో మునిగి తేలుతూ మా ఇంటికి తిరిగి వెళ్ళేవాణ్ణి.

కొన్నిరోజులలా తెలియకుండా గడిచిపోయాయి. ఒకరోజు శొంఠిగాడి నాన్నగారికి హఠాత్తుగా వేరే ఊరు బదిలీ అయినట్లు తెలిసింది.

వాళ్ళు ఊరు వదిలి వెళ్ళిపోయేరోజు శొంఠిగాడి చెల్లెలు నన్ను చాటుగా వచ్చి కలుసుకుంది. ఆ అమ్మాయి అలా కలుసుకుంటుందని నేను అనుకోలేదు.

"మేము వెళ్ళిపోతున్నాం తెలుసా...?" అంది.

"............" నాకేం సమాధానం చెప్పాలో తోచక అలా చూస్తుండిపోయాను.

"నాకు వెళ్ళాలని లేదు. కాని ఏంచేస్తాం... తప్పదంట. నేను మళ్ళీవచ్చేస్తాను. బెంగపెట్టుకోకే."

"..............." ఇంకా నోరు పెగల్లేదు.

"బాధపడుతున్నావు కదూ, నాకు తెలుసులే. పోనీ నేను మళ్ళీ తిరిగివచ్చే దాకా నీకు ఉత్తరాలు రాస్తుంటాను, నువ్వు కూడా నాకు రాస్తూండు. సరేనా...?"

"సరే" అనగలిగాను... అంతే.

వాళ్ళు వెళ్ళిపోయారు. రోజులూ, వారాలూ, సంవత్సరాలూ ఒకదాని తరవాత ఒకటి గడిచిపోతున్నాయి.

ఆ అమ్మాయి నాకు ఒక్క ఉత్తరంకూడా రాయలేదు. నేనుకూడా తనకి ఎప్పుడూ ఉత్తరం రాయలేదు. మూడు దశాబ్దాలు గడిచిపోయాయి.

ఉత్తరాలు రాసుకోవడానికి అడ్రసులు కావాలనే సంగతికూడా తెలీని పసితనం... కాల ప్రవాహంలో కొట్టుకుపోయింది! *